క్లుప్తంగా

పంటల నమోదు చేయించుకోవాలి

వెల్దండ: రైతులందరు సాగుచేసిన పంటల నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని ఏఈఓ సురేష్‌గౌడు పేర్కొన్నారు. శనివారం రైతుల పంటలను ఆయన పరిశీలించి వారి వివరాలను, పంటల నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఏఈఓ మాట్లాడుతూ పత్తికి సీసీఐకి విక్రయిస్తే ఖచ్చితంగా పంట ఆన్‌లైన్ నమోదు ఉంటేనే మద్దతు ధర చెల్లిస్తారన్నారు. అదే విధంగా మొక్కజొన్న, వరి పంటలను నమోదు చేసుకోవాలన్నారు. పలు సూచినలు, సలహాలు ఇచ్చారు.

పీడీఎస్‌యూ నాయకుల నిరసన

కల్వకుర్తి రూరల్: పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాల నిబంధనలకు విరుద్ధంగా రెండో శనివారం తెరచి ఉండటంతో విషయం తెలుసుకున్న పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం నాయకులు పాఠశాలకు చేరుకొని నిరసన తెలిపి పాఠశాలను మూసి వేయించారు. సెలవు రోజులో పాఠశాల నడిపిస్తున్న యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థి సంఘం నాయకులు సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అధ్యక్షుడిగా నిరంజన్

కందనూలు: దివ్యాంగుల ఉద్యోగుల సంఘం నూతన జిల్లా అధ్యక్షుడిగా నిరంజన్ ఎన్నికయ్యారు. శనివారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన దివ్యాంగ ఉద్యోగుల కార్యవర్గ సమావేశంలో జిల్లా కొత్త కమిటీని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా గోపాల్, కోశాధికారిగా టి. హరి ప్రసాద్, ఉపాధ్యక్షుడు పర్వతాలు, సంయుక్త కార్యదర్శిగా మురళికృష్ణ, మహిళా అధ్యక్షురాలు వి. నిర్మల ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

కల్వకుర్తి రూరల్: మండలంలోని ఎల్లికల్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జమీల్ ఇటీవల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎన్నికయ్యారు. శనివారం పాఠశాల ఆవరణలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిని శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బాలిశ్వర్, బ్రహ్మం ఉన్నారు.

ఆశావర్కర్స్ జిల్లా కమిటీ ఎన్నిక

నాగర్‌కర్నూల్ రూరల్: జిల్లా కేంద్రంలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా 3వ మహాసభలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎంపిక చేశారు. జిల్లా అధ్యక్షురాలుగా జయమ్మ, కార్యదర్శిగా కళావతి ఎన్నికయ్యారు. ఆశావర్కర్ల సమస్యల పరిష్కారానికి పోరాడుతామని వారు పేర్కొన్నారు.

కేటీఆర్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే

కల్వకుర్తి రూరల్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ ఆధ్వర్యంలో నాయకులు మాజీ ప్రజాప్రతినిధులు శనివారం హైదరాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పార్టీ చేస్తున్న కార్యక్రమాలను మాజీ ఎమ్మెల్యే కేటీఆర్‌కు వివరించారు. ఆయన వెంట మాజీ జెడ్పీటీసీ విజితా రెడ్డి, అర్జున్ రావు తదితరులు ఉన్నారు.

గుడిసె దగ్ధం

పెద్దకొత్తపల్లి: మండలంలోని దేవునితిరుమలాపూర్‌లో ఎరుకలి నాగరాజుకు సంబంధించిన గుడిసె షార్ట్‌సర్క్యూట్‌తో శనివారం దగ్ధం అయ్యింది. గుడిసెలో తిండిగింజలు, వస్త్రాలు, వంట సామాగ్రి పూర్తి కాలిపోయినట్లు బాధితుడు తెలిపాడు. దాదాపుగా రూ.20 వేల వరకు నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. ప్రభుత్వం బాధితుడిని ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

పోస్టర్ విడుదల

బల్మూర్: హైదరాబాద్‌లోని నార్సింగ్‌లో ఈ నెల 19 నుంచి నిర్వహించే ఫొటో ఎక్స్‌పోకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను శనివారం ఎస్‌ఐ రాజేందర్ విడుదల చేశారు. కార్యక్రమంలో ఫొటో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నియోజకవర్గ అధ్యక్షుడు తాటికొండ గిరి, మండల అధ్యక్షుడు గణేష్‌నాయక్, సీనియర్ ఫొటో గ్రాఫర్స్ శ్రీనువాసులు, మన్సూర్, రఫీ, ఇట్టే చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చారకొండ: మండలంలోని మాడ్గుల 33 కేవీ ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా మండలంలోని సిర్సనగండ్ల, చారకొండ సబ్‌స్టేషన్ల పరిధిలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ జానకిరాం నాయక్ శనివారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరాఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.

శిథిలావస్థలో వసతి గృహం



కూలేందుకు సిద్ధంగా ఉన్న కొండనాగుల బీసీ బాలుర వసతి గృహం



పెచ్చులూడుతున్న వసతి గృహం పై కప్పు

- పెచ్చులూడుతున్న హాస్టల్ పై కప్పు
- భయాందోళనలో విద్యార్థులు

బల్మూర్: మండలంలోని కొండనాగుల బీసీ బాలుర వసతి గృహం శిథిలావస్థకు చేరింది. సుమారుగా 45 ఏళ్ల కిందట నిర్మించిన వసతి గృహంలో కనీస వసతులు కరువయ్యాయి. భవనం పైకప్పు పెచ్చులూడి పడుతుండటంతో విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ కాలం వెల్లదీస్తున్నారు. గతంలో వందలాదిమంది విద్యార్థులతో కిటకిటలాడేది. ప్రస్తుతం కిటీకీలు, తలుపులు ఊడిపడటంతో రాత్రి వేళ విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. దోమకాటుతో రోగాలబారిన పడుతున్నారు. విద్యుత్ సమస్య తలెత్తడంతో బల్బులు కూడా వెలగడం లేదు. కొన్ని నెలల నుంచి హాస్టల్‌లో విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోవడంతో అంధకారంలో చదవలేక నానా అవస్థలు ఎదుర్కొంటున్నారు.

పదేళ్లుగా ప్రకటనలకే పరిమితం

కొండనాగుల బీసీ బాలుర వసతి గృహాన్ని కొత్తగా నిర్మిస్తామని పదేళ్లుగా పాలకులు ఇస్తున్న హామీలు నీటిమీద రాతలాగే మిగిలాయి. ఇప్పటివరకు కార్యరూపం దాల్చడం లేదు. దీంతో ప్రతి విద్యా సంవత్సరం ఈ వసతి గృహంలో విద్యార్థుల సంఖ్య తగ్గుతూ వస్తోంది. అయిన పాలకులు, అధికారులు పట్టింపు లేకుండా వ్యవహరిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.

> **అద్దె గదులు తీసుకున్నాం..**
>
> హాస్టల్ భవనం శిథిలావస్థ స్థితికి చేరుకొని పెచ్చులూడి పడుతోంది. పాత భవనాన్ని భోజనానికి మాత్రమే వినియోగిస్తున్నాం. ఐదు ప్రైవేట్ గదులను అద్దెకు తీసుకొని సౌకర్యాలు కల్పిస్తున్నాం. నూతన భవన నిర్మాణం కోసం రూ.4 కోట్లు మంజూరైనట్లు ఇటీవల ఎమ్మెల్యే ప్రకటించారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం.
>
> – రామకృష్ణ, వార్డెన్, బీసీ బాలుర వసతి గృహం, కొండనాగుల

విద్యాసంస్థల్లో సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

కందనూలు: ప్రభుత్వ విద్యాసంస్థలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని బీఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా సంస్థలు ప్రారంభమై దాదాపు మూడు నెలలు గడిచినా నేటికీ ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని, వసతి గృహాలకు భోజన రుసుములు, అద్దె భవనాల కిరాయి, ఉపకార వేతనాలు పెండింగ్‌లో ఉన్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని విమర్శించారు. అనంతరం పట్టణ మహిళా సమన్వయ కర్తగా అరుణను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సాయిబాబు, సుమిత్ర, పల్లవి, ప్రమీల, ఐశ్వర్య, రిషిత, కవిత, అంజలి పాల్గొన్నారు.

సామూహిక వివాహాలు పేదలకు వరం



దరఖాస్తు చేసుకుంటున్న యువతి

అచ్చంపేట రూరల్: సామూహిక వివాహాలు పేదలకు వరం లాంటివని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. శనివారం అచ్చంపేటలో ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కౌన్సిలర్ అప్పశివ ఆధ్వర్యంలో నవంబర్ 16న అచ్చంపేటలో నిర్వహించే ఉచిత సామూహిక వివాహాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అచ్చంపేట నియోజకవర్గ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా సామూహిక వివాహాలను జరపడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ సమాజ సేవకు పాటుపడాలన్నారు. అచ్చంపేట నియోజకవర్గంతో పాటు దేవరకొండ, నాగర్‌కర్నూల్ ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగపర్చుకోవాలన్నారు. పట్టణంలోని లింగాల రోడ్డులో ఉన్న అప్పశివ జ్యూవెల్లర్స్‌లో పేర్లను నమోదు చేసుకోవాలని కౌన్సిలర్ కోరారు. బంగారు పుస్తె, వెండి మెట్టెలతో పాటు వధూవరులకు దుస్తులు, బీరువా, ఇతర గృహోపకార వస్తువులు ఇస్తామని వివరించారు. వివరాలకు సెల్: 7661008966ను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేందర్, నాయకుడు గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా సాయుధ పోరాట వారోత్సవాలు



తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల్లో జిల్లా కార్యదర్శి ఎండీ ఫయాజ్

బిజినేపల్లి: మండల కేంద్రంలో సీపీఐ జిల్లా కార్యవర్గం పిలుపు మేరకు తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను శనివారం నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎండీ ఫయాజ్ పాల్గొని సీపీఐ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. చరిత్రను వక్రీకరించేందుకు బీజేపీ కుట్ర పన్నుతోందని ఆరోపించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి కృష్ణాజీ, నాయకులు చంద్రమౌళి, మధుగౌడు, మంగంపేట శ్రీనివాస్, కిరణ్‌కుమార్, నారాయణ, సాయిలు, పోచమ్మ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సరిపడా యూరియా సరఫరా చేయాలి

పెద్దకొత్తపల్లి: ప్రభుత్వం రైతులకు సరిపడా యూరియాను సరఫరా చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎండీ ఫయాజ్ డిమాండ్ చేశారు. దేవునితిరుమలాపూర్‌లో శనివారం సీపీఐ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం సీపీఐ గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటస్వామి, శేషయ్య, రామకృష్ణ, రంగస్వామి, శ్రీనివాసులు, శివుడు, కుర్మయ్య , ప్రకాష్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన



వెల్దండ: మండలంలోని సింగిల్‌విండో కార్యాలయ ఆవరణంలో సైబర్ నేరాలపై శనివారం పోలీస్‌సిబ్బంది నవీన్‌కుమార్, కృష్ణ అవగాహన కల్పించారు. వ్యక్తిగత సమాచారం గోప్యంగా ఉంచుకోవాలని సూచించారు. గుర్తుతెలియని వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆన్‌లైన్ మోసాలపై అవగాహన ఉండాలని, పలు చట్టాలు, హక్కుల గురించి వివరించారు. కార్యక్రమంలో పోలీస్‌సిబ్బంది, తదితరులు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత



తాడూరు: మండలంలోని పాపగల్ గ్రామానికి చెందిన శివరాజు అనారోగ్యంతో మృతి చెందారు. వివిధ సంఘాల ఆధ్వర్యంలో శనివారం బాధిత కుటుంబానికి రూ.1.16 లక్షలు అందించారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

లింగాల: మండల కేంద్రానికి చెందిన వడ్త్యా గంగాబాయి రెండు రోజుల కిందట అనారోగ్యంతో మృతి చెందింది. శనివారం మృతురాలి కుటుంబానికి బంజార సేవా సంఘం ఆధ్వర్యంలో రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. బంజార సేవా సమితి నాయకులు పటేల్ భద్రునాయక్, జహంగీర్‌నాయక్, బాలాజీనాయక్, శంకర్‌రాథోడ్, వి.గోపి, లక్ష్మణ్, ఎం.శంకర్, హనుమంతు, రాజు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

యూనిఫాం, స్వెటర్స్ వితరణ



లింగాల: మండలంలోని పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులకు, మండలంలోని ఎర్రపెంటకు చెందిన చెంచులకు శనివారం తత్వా గ్లోబల్ స్కూల్ హైదరాబాద్ ఆర్థిక సహకారంతో నైస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో యూనిఫాం, స్వెటర్స్‌ను వితరణ చేశారు. మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలురు గురుకుల పాఠశాల, కళాశాలకు చెందిన 1,000 మంది విద్యార్థులకు బల్మూర్‌లోని కస్తూర్బా విద్యాలయం విద్యార్థినులు 450 మందికి, మండలంలోని ఎర్రపెంటలో 200 మంది చెంచులకు యూనిఫాంతో పాటు స్వెటర్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ డైరెక్టర్ పూర్ణచందర్‌రావు, సభ్యులు పాల్గొన్నారు.

బుక్‌లెట్స్ పంపిణీ

బిజినేపల్లి: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాని సంబంధించిన బుక్ లెట్స్‌ను శనివారం మండల కేంద్రంలో సీపీఎం నాయకులు పంపిణీ చేశారు. సాయుధ పోరాటాన్ని బీజేపీ వక్రీకరిస్తోందని పేర్కొన్నారు. మండల నాయకులు చంద్రశేఖర్, మల్లేష్, సంతోష్, మహిమూద్, మల్లేష్ తదితరులు అన్నారు.

దంచి కొట్టిన వాన

- చెరువులు జలకళ
- నీట మునిగిన పంటలు



కొల్లాపూర్ నుంచి పెంట్లవెల్లికి వెళ్లే రోడ్డుపై పారుతున్న వరద

కొల్లాపూర్: పట్టణంలోని శుక్రవారం రాత్రి నుంచి శనివారం తెల్లవారుజాము వరకు జోరువాన కురిసింది. 87.4 మి.మీగా వర్షపాతం నమోదైంది. వర్షం కారణంగా వాగులు ఉధృతంగా ప్రవహించాయి. చుక్కాయిపల్లి చెరువు, కావలోనికుంట, వరిదేల చెరువు, మల్లపురాజుకుంట నిండుకున్నాయి. పలు చెరువుల తూములు తెరిచారు. పంటపొలాల్లో వర్షపు నీరు నిలిచింది.

ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, వంకలు

కొల్లాపూర్ రూరల్: మండలంలో మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు పలు గ్రామాలకు సమీపంలో ఉన్న వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. మూడు రోజులుగా గ్రామాలలో జనజీవనం స్తంభించింది. ఎడతెరుపు లేకుండా వర్షం కురవడంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. నార్లాపూర్ గ్రామ సమీపంలో ఉన్న పెద్ద వాగు, ముక్కిడిగుండం గ్రామ సమీపంలో ఉన్న చిన్న వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఇటీవల నాటిన వరి పైరు కూడా వర్షపు నీటి ఉధృతికి కొట్టుకుపోయింది.

ఎడతెరపిలేని వాన

బల్మూర్: మూడు రోజులుగా కురుస్తున్న ఎడతెరిపిలేని వర్షం కురుస్తోంది. మండలంలో వీరంరాజ్‌పల్లి, రామాజిపల్లి, జిన్‌కుంట, పోలేపల్లి, పోలిశెట్టిపల్లి, గోదల్, బల్మూర్, మైలారం, తుమ్మెన్‌పేట చెరువులు నిండి అలుగులు పారుతున్నాయి. వరి, పత్తి, జొన్న పంటలు నీటమునిగి దెబ్బతిన్నాయి





గేమ్యానాయక్ తండాలో కొట్టుకుపోయిన మినుము పంట, కళకళలాడుతున్న వీరంరాజ్‌పల్లి చెరువు

రాజీమార్గంతోనే కేసుల పరిష్కారం



జాతీయ లోక్‌అదాలత్‌లో మాట్లాడుతున్న జడ్జిలు శ్రీదేవి, కావ్య

కల్వకుర్తి టౌన్: కక్షిదారుల రాజీమార్గంతోనే కేసులు పరిష్కరించుకోవాలని కల్వకుర్తి సీనియర్ సివిల్ కోర్టు జడ్జి శ్రీదేవి కోరారు. శనివారం కోర్టులో నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో జూనియర్ సివిల్ కోర్టు జడ్జి కావ్యతో కలిసి ఆమె పాల్గొన్నారు. కల్వకుర్తి కోర్టు పరిధిలో 582 కేసులలో కక్షిదారులు రాజీపడ్డారని తెలిపారు. కోర్టులో 582లో 52 అడ్మిషన్ కేసులు, 34 రాజీ కుదిరిన కేసులు, మూడు సివిల్ కేసులు పరిష్కారం అయ్యాయని వివరించారు. మార్నింగ్ కోర్టు కేసులలో భాగంగా 493 కేసులలో రూ.1,65,200 లక్షలు జరిమానాలు విధించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు, కోర్టు పరిధిలోని పోలీసులు, కక్షిదారులు పాల్గొన్నారు.

రాజీమార్గమే రాజమార్గం

కొల్లాపూర్: కక్షిదారులు చిన్నపాటి తగాదాలు, గొడవల కారణంగా సంవత్సరాల తరబడి కోర్టుల చుట్టూ తిరగకుండా రాజీమార్గంలో వాటిని పరిష్కరించుకోవాలని కొల్లాపూర్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు మెజిస్ట్రేట్ ఉపనిషధ్వాణి అన్నారు. శనివారం కోర్టు హాల్‌లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. 1 వ బెంచీకి మెజిస్ట్రేట్‌గా జూనియర్ సివిల్ జడ్జి ఉపనిషధ్వాణి, న్యాయ సేవాధికార సంఘం సభ్యులుగా ఆర్.కురుమూర్తి, మోహన్‌లాల్, 2 వ బెంచీకి మెజిస్ట్రేట్‌గా ఆర్.శరణ్య న్యాయసేవాధికార సంఘం సభ్యులుగా టి.శివారెడ్డి వ్యవహరించారు. లోక్ అదాలత్‌లో పలు కేసులు పరిష్కరించారు.

కల్వర్టు నిర్మించాలని ఎమ్మెల్యేకు వినతి

ఉప్పునుంతల: మండలంలోని వెల్టూరు చెరువు అలుగునీరు పారే ప్రాంతం నుంచి తమ పొలాలకు వెళ్లే దారి ఉండటంతో చెరువు నిండి అలుగుపారే సమయంలో ప్రతియేటా ఇబ్బంది పడుతున్నామని గ్రామానికి చెందిన కొంతమంది రైతులు శనివారం అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణను కలిసి వినతిపత్రం అందజేశారు. అలుగు ప్రాంతంలో కల్వర్టును నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. అలుగుగుండా వెళ్లే దారి వెంట దాదాపు వంద మంది రైతులకు సంబంధించిన పొలాలు ఉన్నాయని వివరించారు. కల్వర్టు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలని కోరారు. జంగిరెడ్డి, బాల్‌రాజు, రమేష్, వెంకటేష్, బాలింగయ్యగౌడ్, వేణు, జంగయ్య తదితరులు ఉన్నారు.

చదువుపై శ్రద్ధ వహించాలి

అచ్చంపేట రూరల్: విద్యార్థులు చదువుపై శ్రద్ధ వహించాలని ఎస్సీ హాస్టల్ వార్డెన్ మల్లయ్య సూచించారు. శనివారం పట్టణంలోని ఎస్సీ హాస్టల్‌లో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. రానున్న దసరా సెలవుల్లో తల్లిదండ్రులు విద్యార్థులపై దృష్టి సారించాలన్నారు.

అందుబాటులో యూరియా



చారకొండ: మండలంలోని యూరియాను ప్రతి రైతుకు అందిస్తున్నామని మండల వ్యవసాయ అధికారి తనూజరాజ్ అన్నారు. శనివారం ఏఓ మాట్లాడుతూ మండలంలోని వరి, పత్తికి 18,911 ఎకరాల్లో సాగుచేశారని, రైతులకు ఇప్పటి వరకు 556 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ చేసినట్లు తెలిపారు. మండలంలోని యూరియా అందుబాటులో దాదాపుగా 27.1 మెట్రిక్ టన్నుల(542 బస్తాల) యూరియా అందుబాటులో ఉందని పేర్కొన్నారు. మండల కేంద్రంలోని సింగిల్ విండో సొసైటీ, మన గ్రోమోర్, రైతు ఆగ్రోస్ కేంద్రాల ద్వారా పంపిణీ జరుగుతుందని తెలిపారు. మండలంలోని యూరియా కొరత లేదని చెప్పారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు యూరియాను తక్కువ మోతాదులో వాడాలని సూచించారు. నానో యూరియా వాడాలని తద్వారా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి పొందవచ్చని వివరించారు. పంట నమోదును రైతులు ఆయా గ్రామాల్లో ఏఈఓల ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని కోరారు.

రేపు తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడిస్తాం

కొల్లాపూర్ రూరల్: రాష్ట్రంలో వృద్ధులు, దివ్యాంగుల పెన్షన్లు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తు దండోరా ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయాన్ని సోమవారం ముట్టడిస్తామని దండోరా మండల ఇన్‌చార్జి ఎదుల రాముడు మాదిగ హెచ్చరించారు. శనివారం మండలంలోని అంకిరావుపల్లిలో దండోరా కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం దివ్యాంగులకు రూ.6000, వృద్ధులకు వివిధ రకాల చేతి వృత్తి దారులకు ఇస్తున్న పెన్షన్ రూ.4000 వేలకు పెంచుతామని హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. ప్రభుత్వం హామీని విస్మరించినందుకు నిరసన కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. వృద్ధులు, దివ్యాంగులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

బ్రిడ్జి నిర్మించాలి

తాడూరు: కేసరి సముద్రంపై బ్రిడ్జి నిర్మించాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు కాశన్న డిమాండ్ చేశారు. మండలంలోని చర్లతిర్మాలాపురం నుంచి జిల్లా కేంద్రానికి వెళ్లే ప్రధాన రోడ్డుకు అనుసరించుకొని ఉన్న బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం బ్రిడ్జి దగ్గర కేవీపీఎస్ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయని దీంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. నాయకులు స్వామి, కురుమయ్య, భరత్, రాములు, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

మూగజీవాల వైద్యంపై సిబ్బంది నిర్లక్ష్యం

తిమ్మాజిపేట: మండలంలోని మరికల్‌లో ఓ కోడె దూడ కడుపు ఉబ్బి మేత మేయకపోవడంతో సంబంధిత రైతు 1962 (వెటర్నరీ మొబైల్ అంబులెన్స్)కు సమాచారం ఇచ్చాడు. దీంతో నాగర్‌కర్నూల్ నుంచి అంబులెన్స్‌లో పశువైద్య అధికారి ప్రియాంక, సిబ్బంది వచ్చారు. దూడను పరీక్షించి చీటీపై మందులు రాసి బయట తీసుకురావాలని సూచించారు. దీంతో గ్రామస్తులు మందులు లేకుండా సర్వీసు ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించారు. ప్రభుత్వం నుంచి మందులు సరఫరా కావడం లేదని వైద్యాధికారి సమాధానం ఇచ్చారు. వెటర్నరీ అంబులెన్స్ సిబ్బంది ఖాళీ చేతులతో వచ్చి వైద్యం ఎలా వైద్యం చేస్తారని స్వేరో నెట్‌వర్క్ నాగర్‌కర్నూల్ జిల్లా కోకన్వీనర్ గిద్ద విజయ్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మూగజీవాలకు సరిపడా మందులు సరఫరా చేయాలని కోరారు.

కొనసాగుతున్న సమ్మె

లింగాల: మండల కేంద్రంలోని ఆయా వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలలలో పని చేస్తున్న వర్కర్లు చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం రెండో రోజు కొనసాగింది. వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలల ఎదుట వర్కర్లు బైటాయించారు. ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలని, తగ్గించిన వేతనాలను గతంలో మాదిరిగా పునరుద్ధరించాలని తదితర డిమాండ్లను వెంటనే పరిష్కరించాలన్నారు. వర్కర్లు సమ్మెలో ఉండటంతో ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయులే వంటలు వండుతున్నారు.

'హాస్టల్‌లో మౌలిక వసతులు కల్పిస్తాం'

బల్మూర్: మౌలిక వసతులు కల్పిస్తామని ఎస్సీ హాస్టల్ వెల్ఫేర్ అధికారి కృష్ణయ్య అన్నారు. స్థానిక ఎస్సీ బాలుర వసతి గృహంలో శనివారం విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోనూ ప్రకారం భోజనం అందిస్తున్నామని తెలిపారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాల కల్పనకు కృషి చేస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

యూరియా కోసం రైతుల అవస్థలు

కల్వకుర్తి రూరల్: యూరియా కొరత రైతులకు కన్నీళ్లు తెప్పిస్తుంది. అదను దాటుతుండడంతో రైతుల్లో ఆందోళన చెందుతున్నారు. సాగు చేసిన పంటకు ఎలా కాపాడుకోవాలో అర్థం కాక తలలు పట్టుకుంటున్నారు. ఒకవైపు యూరియా కోసం నిద్రాహారాలు మాని వేకువ జాము నుంచి క్యూ లైన్ లో నిల్చుంటున్నారు. మరోవైపు వర్షాలు రైతన్నలను అతలాకుతలం చేస్తున్నాయి. పూత, కాత దశలో ఉన్న పత్తి వర్షాలతో దెబ్బతింటోంది. జిల్లాలో సాగుచేసిన పత్తి పంటకు తెగుళ్ల సోకి పంట ఎర్రబారింది. దీంతో దిగుబడి తగ్గిపోయే ప్రమాదం పొంచి ఉంది. శనివారం ఆగ్రో కేంద్రం వద్ద రైతులు యూరియా కోసం ఎదురుచూస్తున్నారు. కేంద్రం వద్దకు వచ్చిన రైతులకు టోకెన్లు జారీ చేసి ఎరువులు పంపిణీ చేసే ప్రక్రియను చేపట్టారు. ఒకరికి ఒక బస్తామాత్రమే ఇవ్వడంతో సమస్య మరింత జటిలమైంది.

'టీఎస్పీఎస్సీ చైర్మన్ రాజీనామా చేయాలి'

కందనూలు: గ్రూప్–1 పరీక్షలో అవకతవకలకు పాల్పడిన టీఎస్పీఎస్సీ చైర్మన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో శనివారం భారీ ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ చౌరస్తా వద్ద సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ జిల్లా కోఆర్డినేటర్ విష్ణుసాగర్ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిరుద్యోగ యువతకు శాపంగా మారిందని, హైకోర్టు ఇచ్చిన తీర్పుకు అనుగుణంగా గ్రూప్–1 పరీక్షను రద్దు చేసి పరీక్షకు తక్షణమే నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. జీఓ నంబర్ 29 రద్దు చేసి జీఓ నంబర్ 55 ఇంప్లిమెంటేషన్ చేయాలని కోరారు. అవకతవకలపై సిట్టింగ్ జడ్జితో జ్యూడిషియల్ కమిషన్ ఏర్పాటు చేసి పూర్తి స్థాయి విచారణ చేయాలని డిమాండ్ చేశారు. ఇంగ్లీష్‌లో 12,381 మంది పరీక్ష రాస్తే 508 మంది ఎంపికయ్యారు. తెలుగులో 8,694 మంది పరీక్ష రాస్తే కేవలం 56 మంది మాత్రమే ఎంపికయ్యారని తెలుగు మీడియం చదివిన అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరిగిందని వాపోయారు. కార్యక్రమంలో జానకిరాం , పాలమూరు శివ, రమణ, వంశీగౌడ్ తదితరులు పాల్గొన్నారు.